క్లుప్తంగా

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీకస్తూరి వెంకటేశ్వర కల్యాణ మండపంలో బుధవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారం బుధవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేసి వారిచే ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు పేర్కొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

కోదాడరూరల్ : తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పట్టణ సీఐ కె.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసినా బైక్ ఫొటో, వీడియోలు తీసి తమ వాట్సాప్ నంబర్ 87126 86009కు పంపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని ఆయన పేర్కొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళాలతో ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాల్లో బూరుగడ్డ ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆయా ఆలయాల ఈవోలు ఎంపి లక్ష్మణరావు, చలపతి, అర్చకులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం కోదాడ మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన పెండెం జానకిరామయ్య జ్ఞాపకార్థం సతీమణి మంగమ్మ, కుమారులు పెండెం వెంకట్రామ్, పెండెం తారకగౌడ్, కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోర్డినేటర్ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు, లక్ష మల్లెపూలతో పుష్పార్చన నిర్వహించారు. అదేవిధంగా ఆలయ పరిధిలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వార్ల శాంతికల్యాణాన్ని వైభవంగా జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, రాధాకృష్ణమూర్తి, రాఘవశర్మ, సాయి, సాయిమహేష్‌శర్మ, భానుకిరణ్‌శర్మ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న సంఘం డెయిరీ ప్రతినిధులు, పశువైద్య సిబ్బంది

కోదాడరూరల్ : సంఘం డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ డెయిరీ తెలంగాణ జోనల్ హెడ్ కె.నాగప్రభు కోరారు. మంగళవారం మండలంలోని గణపవరంలో సంఘం డైరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య డాక్టర్ యశ్వంతరావు, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, కోదాడ ప్లాంట్ మేనేజర్ వరప్రసాద్, రమేష్, రాధాకృష్ణ, రైతులు రవి, హనుమంతరావు, లింగయ్య, బుచ్చాలు ఉన్నారు.

ఆనాటి బావులు.. అన్నింటికీ పేర్లు

- నడిగూడెంలో పురాతన బావులకు పేర్లు
- పూర్వీకులు పెట్టిన పేర్లతోనే పిలుస్తున్న గ్రామస్తులు



నడిగూడెంలో చిన తోటలో ఉన్న మూల బావి

నడిగూడెం : మనుషులకు, జంతువులకు పేర్లు ఉన్నట్లుగానే నడిగూడెంలోని పలు వ్యవసాయ, తాగు నీటి బావులకూ పేర్లు ఉన్నాయి. 60 ఏళ్ల క్రితం తీసిన బావులకు పూర్వీకులు పేర్లు పెట్టారు. ఆ పేర్లతోనే బావులను నేటితరం పిలుస్తున్నారు.

వేప చెట్లు ఉంటే..

రాజావారి తోటలో మూలకు బావి ఉండడంతో మూల బావి అని, బావి చుట్టూ రాళ్లతో రక్షణ గోడ కట్టడంతో రాళ్ల బావి అని, బావిలో అంచుల వెంట గరుకుగా ఉండడంతో గరుకు బావి అని అప్పటో పేర్లు పెట్టారు. బావి వెంట రెండు పెద్ద తుమ్మ చెట్లు ఉండడంతో తుంబావి అని, బ్రాహ్మణులది కావడంతో బేపనబావి అని, గ్రామంలో అన్ని బావుల కన్నా పెద్దగా ఉండడంతో పెదబావి అని, సందులో బావి ఉండడంతో దానిని సందు బావి అని, తోటలో బావి ఉండడంతో తోట బావి అని పిలుస్తున్నారు. శ్రీ సారంగేశ్వరస్వామి ఆలయం వెంట బావి ఉండడంతో దానిని దేవుని బావి అని, బావిలో నిత్యం చేపలు పెంపకం చేస్తుండడంతో దానిని చేపల బావి అని చెబుతున్నారు. రాజావారి తోటలో ఉన్న పలు బావులను దొరోరి బావులని, చిన తోటలో ఉన్న బావిని చింతోట బావి అని పేర్లతో పిలుస్తున్నారు. బావి చుట్టూ వేప చెట్లు ఉండడంతో వేప బావి అని, బావి వెంట మర్రిచెట్లు ఉండడంతో మర్రి బావి అని చెబుతున్నారు. గ్రామంలో అన్ని బావులకన్నా చిన్నగా ఉన్న బావిని చినబావి అని, బావిలో బండ ఉండడంతో దానిని బుడబావి అని అంటున్నారు. బావి చుట్టూ చింత చెట్లు ఉండడంతో దానిని చింతబావి అని, గ్రామానికి చెందిన పలువురు 50 ఏళ్ల నాటి బావులను వెంపటోరి బావి, వందనపోరి బావి, బీరవల్లివారి బావి, పందిరోరి బావి అని ఇలా అనేక పేర్లతో నాటి నుంచి నేటివరకు ప్రజలు పిలుస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా ప్రజల తాగు నీటి అవసరాల కోసం తీయించిన పలు బావులను ఇప్పటికీ గిరకల బావి, చేత బావి అని పిలుస్తుంటారు.



సారంగేశ్వరచెరువు వెంట ఉన్న దేవుని బావి

బావులకు పేర్లు పెట్టాం



మా చిన్న నాటి రోజుల్లో నడిగూడెం దొరవారికి జీతా ఉన్నాం. ఆ రోజుల్లో వ్యవసాయ బావులను తవ్వాం. రోజుకు 30 నుంచి 40 మంది కూలీలు వచ్చి బావులు తీశాం. అప్పట్లో బావులకు పేర్లు పెట్టాం. దొరవారి బావిని దొరోరి బావి అని, మూల బావి, తుం బావి అని నాటి నుంచి బావులను పేర్లతోనే పిలిస్తున్నాం. ఒక బావి తీయాలంటే నాలుగైదు నెలలు సమయం పట్టేది.

– కన్నెబోయిన కృష్ణమూర్తి, నడిగూడెం

ఇప్పటికీ పేర్లతోనే పిలుస్తున్నాం



నా చిన్న నాటి నుంచి నేటికి మా గ్రామంలోని బావులను పేర్లతోనే పిలుస్తున్నాం. మా పూర్వీకులు వ్యవసాయ బావులకు పెట్టిన పేర్లతోనే పిలుస్తున్నాం. మా గ్రామంలో ప్రతి వ్యవసాయ బావికి ఒక పేరు ఉన్నది. కానీ ప్రస్తుత రోజుల్లో బావులకు పేర్లు పెట్టడం లేదు.

– ఎండి. మహిమూద్, నడిగూడెం

మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను



మునగాల : సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ : మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన రైస్ మిల్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా అన్ని సెంటర్లలో జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు, సభలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. అనంతరం రైస్ మిల్ డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐ.తిరపయ్య, కార్యదర్శిగా కె.లాలయ్య, మరో తొమ్మిది మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మల్లయ్య, పర్వతాలు, సైదులు, వీరబాబు, గోపాలు, జానకిరాముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో గేట్ మీటింగ్

నియోజకవర్గ వ్యాప్తంగా మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ నియోజకవర్గ నాయకుడు పి.ఉపేందర్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన రైస్ మిల్ ఇండస్ట్రీ డ్రైవర్స్ యూనియన్ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సైదులు, యర్రయ్య, వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

నడిగూడెం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా మేడేను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జానీ, శ్యామ్, లక్ష్మయ్య, శ్రీను, దుర్గయ్య, గోపి పాల్గొన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయాలి

మునగాల : మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల మోటార్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోటార్ వర్కర్స్ యూనియన్‌ను ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు పచ్చిపాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాశీ నాగార్జునచారి, షేక్ అలీమ్, గుంజ వెంకన్న, మండవ కృష్ణ, ముక్కోల్లు వెంకటేశ్వరరావు, అక్బర్, కోటయ్య, బ్రహ్మం, తడకమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మయ్య (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు నిరుపేద కావడంతో మంగళవారం కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్ మృతుడి కుమారుడు కోటేష్‌కు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ అనంతుల ఉపేందర్, మేకల కృష్ణమూర్తి, కొత్త ఉపేందర్, శివరాత్రి రాయుడు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి : రానున్న ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో పాత రౌడీ షీటర్లకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రమ శిక్షణ కలిగా ఉండాలని కోరారు. సీఐ వెంట ఎస్‌ఐ బాబు, ఏఎస్‌ఐ శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెండేళ్ల సమస్యకు పరిష్కారం



స్థానికులతో మట్లాడుతున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి : పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. హుజూర్‌నగర్ మండలం అంజలిపురం, మఠంపల్లి మండలం అల్లీపురం గ్రామాల్లో గత రెండేళ్లగా వివాదంలో ఉన్న ఆర్చీ నిర్మాణ సమస్యను మంగళవారం సీఐ పరిష్కరించి మాట్లాడారు. ఆర్చీ నిర్మాణంపై రెండు గ్రామాల్లో హిందూ, క్రిస్టియన్ల మధ్య వివాదం నెలకొన్నట్లు తెలిపారు. సీఐ వెంట ఎస్‌ఐ బాబు, ఎంపీడీఓ జగదీష్, ఆయా గ్రామాల పెద్దలు, తదితరులు ఉన్నారు.

నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి

కోదాడ : నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి భిక్షపతి అన్నారు. కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు మాతంగి ప్రభాకర్‌రావుకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆస్కా ద్వార పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించడంలో ప్రభాకర్‌రావు పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, బొడ్డు హుస్సేన్, వెంకటయ్య, రేణుక, నాగయ్య, వెంకటరత్నం, అయోధ్య, ఉపేందర్, రవీందర్, రామకృష్ణ, రాములు, బంకా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

సూర్యాపేట అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో తాగునీటికి సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాగునీటి ఎద్దడి దళిత, గిరిజన వాడల్లో తీవ్రంగా ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, ఎల్గూరి గోవింద్, వీరబోయిన రవి, జె.నరసింహారావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న కోరారు. నడిగూడెం మండలానికి చెందిన పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార కిట్లను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. క్షయ వ్యాధి పట్ల భయపడాల్సిన అవసరం లేదని, క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే పూర్తిగా తగ్గుతుందన్నారు. నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, టీబీ నోడల్ పర్సన్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ఫార్మసిస్టు శైలజ, ఏఎస్ఎంలు మంజుల, విజయకుమారి, రాధ, రమ, మంగ, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

2నుంచి వాలీబాల్ శిక్షణ

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో వచ్చే నెల 2 నుంచి 31 వరకు జిల్లా స్థాయి ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్ తెలిపారు. మంగళవారం ఆయన అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరానికి బిగ్‌హెల్ప్ సంస్థ కూడా తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిబిరం జరుగుతుందని, ఆసక్తి గలవారు రావాలని కోరారు.

హైవేపై ప్రమాదకరంగా కల్వర్టు



అబ్బిరెడ్డిగూడెం మేజర్ కాలువపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

గరిడేపల్లి : మండలంలో హుజూర్‌నగర్ – మిర్యాలగూడ ప్రధాన రహదారిపై అబ్బిరెడ్డిగూడెం మేజర్ కాలువ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కల్వర్టు పక్క నుంచే అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లాలి. అబ్బిరెడ్డిగూడెం వైపు నుంచి వాహనాలు మిర్యాలగూడ రహదారి వైపు వచ్చే క్రమంలో హైవేపై వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో కల్వర్టుపై వద్ద జరిగిన ప్రమాదంలో గరిడేపల్లి, వెంకటరాంపురం, హుజూర్‌నగర్‌కు చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కావున సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును అబ్బిరెడ్డిగూడెం వైపు దూరం పెంచి నిర్మించాలని, హైవేపై సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాజ్‌పేయి స్మృతులు చెరగనివి



సంఘ్ పరివార్ నాయకులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

నేరేడుచర్ల : మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్మృతులు చెరగనివని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి అన్నారు. వాజ్‌పేయి నేరేడుచర్లలో పాదయాత్ర చేసిన సమయంలో వారితో కలిసి పాదయాత్ర చేసిన సంఘపరివార్ పెద్దలను మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంఘ నాయకులు దొంతిరెడ్డి రామిరెడ్డి, కొణతం వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, మెట్టు మధుసూదన్‌రెడ్డి, రంగుల బాషలు నేరేడుచర్లలో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పట్టణ సంరచన ప్రభారి శోభారెడ్డి, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి, తాళ్లూరి రమేష్, శావయ్య, ఎల్ల య్య, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యడవల్లి సైదిరెడ్డి, ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, నాగయ్య, దేవిరెడ్డి నాగిరెడ్డి, దొంతిరెడ్డి రామనర్సమ్మ, సయ్యద్ మగ్బుల్‌బీ, సయ్యద్ రెహమన్ తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



10వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాహుల్‌గాంధీ చేపట్టిన జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేరేడుచర్లలోని 3, 10, 11 వార్డుల్లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ శ్రీను, మాజీ కౌన్సిలర్ రణపంగ నాగయ్య, చింతమళ్ల సైదులు, వెంకటేశ్వర్లు, అజయ్, ఇస్తియాక్, కలీం, కె.శ్రీను, నాగరాజు, సైదులు, వీరబాబు, ఉదయ్, సతీష్, నాగరాజు, పాపయ్య, హరిబాబు, జాను, వెంకటయ్య, మంగ్య తదితరులు ఉన్నారు.

ఆదిరెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి



కోదాడ : ఆదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడ : పేదల పక్షాన పోరాడిన దివంగత నేత ఆదిరెడ్డి ఆశయసాధనకు సీపీఎం కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు కోరారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని తఖధీర్ సెంటర్ వద్ద సీపీఎం నాయకుడు ముదిరెడ్డి ఆదిరెడ్డి 28వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడుతున్న ఆదిరెడ్డిని కొన్ని అసాంఘిక శక్తులు పొట్టన పెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మిట్టగడుపుల ముత్యాలు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎస్‌కె సైదా, జానీ, రామారావు, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముదిరెడ్డి ఆదిరెడ్డికి నివాళి

మునగాల : సీపీఎం సీనియర్ నాయకుడు ముదిరెడ్డి ఆదిరెడ్డి ఆశయసాధనకు పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు కోరారు. ఆదిరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఆదిరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి, బచ్చలకూర స్వరాజ్యం, మండల కమిటీ సభ్యులు చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, సుంకర పిచ్చయ్య, రావులపెంట రమేష్, శాఖ కార్యదర్శి సరికొండ నాగరాజు, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

కాంగ్రెస్ గుండాల చేతిలో హత్యగావించబడిన మునగాల పరగణా ముద్దుబిడ్డ నరసింహులగూడెం కమ్యూనిస్టు యోధుడు ఆదిరెడ్డి ఆశయసాధనకు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిరెడ్డి వర్ధంతి సందర్భంగా జగన్నాథపురంలో ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొక్కిరేణిలో..

మండలంలో కొక్కిరేణిలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో ముదిరెడ్డి ఆదిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, నాయకులు రేఖ లింగయ్య, రావులపెంట వెంకన్న, రావులపెంట బ్రహ్మం, ములకలపల్లి సైదులు, శేషగిరి, అక్తర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మునగాల : ఆదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మునగాల : జగన్నాథపురంలో..

ఏకాగ్రతతో చదివి లక్ష్యాన్ని సాధించాలి



బ్రహ్మారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మిట్స్ కళాశాల వైస్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

చిలుకూరు : విద్యార్థులు ఏకాగ్రతతో చదివి తమ లక్ష్యాలను సాధించుకోవాలని మిట్స్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి అన్నారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు మధిర బ్రహ్మారెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఫౌండర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రపంచంలో మేధావులంతా గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. ముందుగా మధిర బ్రహ్మారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ మధిర సావిత్రిరెడ్డి, ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, బీఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బద్రంరాజు రాము, ఏఓ శ్రీనివాస్, లైబ్రేరియన్ రామారావు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలు తీరుతాయి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

చివ్వెంల : భూభారతితో రైతుల సమస్యలు తీరుతాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం భూభారతిపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డులు ఉన్నట్లే, ప్రతి భూమికి భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూభారతిపై రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, తహసీల్దార్ క్రిష్ణయ్య, మండల ప్రత్యేకాధికారి జగదీష్ రెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావతు వీరన్న నాయక్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో మార్పు

భానుపురి : విద్య ద్వారానే సమాజంలో పేదరికం తొలిగిపోయి దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూరు (ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల, మోతె మండలాలకు చెందిన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులతో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ గతేడాది వైఫల్యాలను సరిచేసుకుని రాను న్న విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలోనే విద్యార్థులకు తెలుగు భాష రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, ఇంక్లూజివ్ కో ఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ పూలమ్మ, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.